వైష్ణవి స్కూల్‌కు ఇన్నొవేటివ్ అవార్డు



రామంతాపూర్: గణేష్ నగర్‌లోని వైష్ణవి ఒలింపియాడ్ స్కూల్‌కు ఉత్తమ ఇన్నోవేటివ్ అవార్డు లభించింది. ఈ మేరకు గ్లోబల్ ట్రంప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎడ్యుకేషనల్ కాంక్లేవ్ కార్యక్రమంలో హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రయ్య ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ శశికుమార్, స్కూల్ చైర్మన్ ఎంఎ కబీర్‌కు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా కబీర్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



మల్లాపూర్: ఎక్స్‌ట్రా మైల్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సబల మహిళా నైపుణ్యాభివృద్ధి సంస్థలో ఉచితంగా కుట్టు మిషన్ నేర్చుకున్న మహిళలకు ఆదివారం సంస్థ అధ్యక్షులు నాగ మోహన్ కుట్టుమిషన్లను అందజేశారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ నరేందర్, కోఆర్డినేటర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలకు ఆదరణ



సమావేశంలో మాట్లాడుతున్న
కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేంతర్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్ సర్కిల్ హెచ్‌ఎంటీనగర్ కాలనీ బతుకమ్మ పార్కులో ఆదివారం మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతమహేంతర్‌రెడ్డి పలు కాలనీవాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జితేంద్రనాథ్, మహేందర్‌రెడ్డి, భూపతిరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

391వ వారానికి చేరిన మణిహారం కార్యక్రమం



మల్లాపూర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మణిహారం కార్యక్రమం 391 వ ఆదివారానికి చేరింది. అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ మహిళా విభాగం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్ : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. నాట్యరత్న రమణి సిద్ధి నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి, ఆహుతులను ఆకట్టుకుంది. వీవీఎస్ జగన్నాధరావు శిష్య బృందం కూచిపూడి ప్రదర్శన అలరించింది.

మున్నూరుకాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం



శామీర్‌పేట్: మేడ్చల్ నియోజకవర్గ మున్నూరుకాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం ఆదివారం తూంకుంటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సమ్మేళనానికి రాజ్యసభ సభ్యుడు డా. లక్ష్మణ్, బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమావేశంలో మేడ్చల్ నియోజకవర్గంలో మున్నూరు కాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

శామీర్‌పేట్: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండగ అని అక్సా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా తూంకుంట మున్సిపాలిటీలో ఆక్సా వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి అనంతరం 50 మంది నిరుపేదలకు ఉచితంగా రేషన్, నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు.

చెట్టుకొమ్మ తగిలి ద్విచక్ర వాహనదారుడు మృతి

అల్వాల్: చెట్టుకొమ్మ తగిలి ద్విచక్ర వాహనదారుడు మృతిచెందిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. బంజారాహిల్స్‌కు చెందిన మహేష్ (21) ఈ నెల 6న అల్వాల్ నుండి శామీర్‌పేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హకీంపేట బస్ డిపో వద్ద రోడ్డు పక్కన ఉన్న చెట్టు కొమ్మ తగలడంతో కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇక అమ్మ ఆదర్శ పాఠశాల...!

- ప్రభుత్వ బడుల్లో వసతుల కల్పన లక్ష్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు
- 10 రకాల పనులకు నిధులు విడుదల చేసిన సర్కారు
- ఈసీ నుంచి ప్రత్యేక అనుమతులు పొందిన యంత్రాంగం



సాక్షి, మేడ్చల్ జిల్లా: మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా.. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఆయా పాఠశాలల్లో విద్యనభ్యసించే పిల్లల తల్లులు ఈ కమిటీల్లో సభ్యులుగా ఉంటారు. పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులను వారే ప్రతిపాదిస్తారు. పాఠశాలలలో ఈ మౌలిక వసతుల కల్పన ప్రక్రియను అధికార యంత్రాంగం వేగిరం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు సంబంధిత అధికారులతోసహా పనులు చేపట్టే ఏజెన్సీలు, పర్యవేక్షణున్న ఇంజినీర్లతో శనివారం సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రభుత్వ పాఠశాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల నేతృత్వంలో చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని ఆదేశించిన విషయం తేల్సిందే. ఇందుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగింపునకు కూడా ఎన్నికల కమిషన్(ఈసీ) నుంచి ప్రత్యేక అనుమతులు తీసుకున్నట్టు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

505 ప్రభుత్వ పాఠశాలలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 505 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక 375, ప్రాథమికోన్నత 22, ఉన్నత పాఠశాలలు 108 ఉన్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలానికి 8 నుంచి 10 వరకు మన ఊరు–మనబడి –మనబస్తీ కింద మొత్తంగా 176 పాఠశాలలను ఎంపిక చేసి మౌలిక వసతుల కల్పన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు దీని కింద దశలవారీగా 40 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు.అయితే, మన ఊరు–మన బడి–మన బస్తీ పథకానికి సంబంధం లేకుండానే... తాజాగా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా మిగిలిన అన్ని పాఠశాలలకు 'అమ్మ ఆదర్శ పాఠశాల' పేరుతో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తోంది. ఈ మార్గదర్శకాలు ఇటీవలే విడుదలయ్యాయి. తదనుగుణంగా పంచాయతీ రాజ్, విద్యుత్తు,ఆర్అండ్‌బీ, ఈడబ్ల్యూఐడీసీ,టీఎస్ఈడబ్ల్యూ,ఓడీసీ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఎన్నికలకు సంబంధం లేకుండానే పనులు...

'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీకి ఆయా పాఠశాల(జీహెచ్ఎంసీ,పురపాలక సంఘాలు,గ్రామ పంచాయతీలు) పరిధిలోని ఏరియా/గ్రామ మహిళా సమాఖ్యలు, సంఘ బంధం సభ్యులు ఒకరు చైర్మన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, తరగతికి ముగ్గురు తల్లులు చొప్పున సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఇతరత్రా మేజరు,మైనర్ మరమ్మతులు చేయదగిన పనులను ఈ కమిటీలు తీర్మానిస్తాయి. విద్యుత్తు అవసరాలకు రూ.25 వేలు, మూత్రశాలలు, మరుగుదొడ్లకు రూ.35 వేలు, తాగునీటి వసతి కల్పనకు రూ.లక్ష వరకు నిధులు వెచ్చించాలన్న నిబంధనలతో 10 రకాల పనులకు నిధులను ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసింది.అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించగానే ఆయా కమిటీల ఖాతాలో నిధులు జమ అవుతాయి. ఏఈ పర్యవేక్షణలో పనులు చేపట్టాల్సి ఉంది.

- ప్రధానంగా మహిళా సంఘాల బలోపేతం, పాఠశాలల్లో కనీస అవసరాలు తీర్చాలన్న ఆశయంతో ప్రభుత్వం ఈ కమిటీలను ఏర్పాటు చేస్తోందని అధికారులు పేర్కొంటున్నారు. లోక్‌సభ ఎన్నికల నిబంధనలను ఈ ప్రక్రియకు మినహాయింపు ఇచ్చేలా ఈసీ నుంచి ముందుగానే ప్రత్యేక అనుమతులు తీసుకున్నట్లు చెబుతున్నారు. పాఠశాలల్లోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో పోలింగ్ సిబ్బందికీ వసతులు ఏమైనా చేపట్టాల్సి ఉన్నట్లయితే.. ఆ పనులు కూడా పోలింగ్ నాటికి ముందే పూర్తయ్యేలా అధికార యంత్రాంగం ఈ ప్రక్రియను వేగవంతం చేస్తోంది.

వ్యాయామంతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు

డాక్టర్ కృష్ణ చైతన్యరావు



కూకట్‌పల్లి: ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయటం వల్ల తమ ఆరోగ్యాలను కాపాడుకోవచ్చని డాక్టర్ కృష్ణ చైతన్యరావు అన్నారు. ఆదివారం వరల్డ్ హెల్త్ డే సందర్భంగా కూకట్‌పల్లిలోని మై హెల్త్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 5కే మారథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణలు పాల్గొని జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాక్స్ హెల్త్ హాస్పిటల్ డైరెక్టర్ కృష్ణచైతన్యరావు మాట్లాడుతూ... ప్రస్తుత రోజుల్లో ప్రతి మనిషి ఆరోగ్యపరంగా గుండె సమస్యలు కిడ్నీ సమస్యలు, మహిళలకు గైనకాలజీ సమస్యలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. వాటిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ వ్యాయామాలు చేయాలన్నారు. 5కె రన్‌లో గెలిచిన డాక్టర్ కిరణ్, శ్రీనివాసులకు మెడల్ అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్నేహారెడ్డి, డాక్టర్ జయంత్‌రెడ్డి, డాక్టర్ ప్రేమ్ కుమార్‌రెడ్డి, అన్వేష్ చౌదరి, భాస్కరరావు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిగూడలో చైన్‌స్నాచింగ్

జవహర్‌నగర్: ఓ మహిళ మెడలో నుండి చైన్‌స్నాచింగ్ జరిగిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా రాయరావుపేటకు చెందిన సాయమ్మ (60) ఆదివారం సాయంత్రం తన పెద్ద కుమార్తెతో కలిసి కాప్రా ఎల్లారెడ్డిగూడలో నివసించే చిన్న కుమార్తె ఇంటికి ఆటోలో వచ్చి అక్కడి నుండి నడుచుకుంటే వెళ్తుంది. వెనుక నుండి ద్విచక్ర వాహనంపై నుండి వచ్చిన యువకుడు ఆమె మెడలో ఉన్న 5 తులాల బంగారు గొలుసు దొంగిలించి పరారీ అయ్యాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ టీవీ కెమెరాలతో పరిశీలిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాంగం వల్లే స్వేచ్ఛ, సమానత్వం



ఘట్‌కేసర్: రాజ్యాంగం స్వేచ్ఛ సమానత్వం ప్రసాదించిందిందని ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు పవన్‌నాయక్ అన్నారు. పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంతో భారతదేశం నేడు ప్రపంచంతో పోటీ పడుతుందన్నారు. కార్యక్రమంలో దాసు, రాజేశ్‌కుమార్, సత్యం, కళ్యాణ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి



బన్నీ (ఫైల్)

జవహర్‌నగర్: ఇటీవల జవహర్‌నగర్ జరిగిన గ్యాస్ లీకేజీ ఘటనలో చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. జవహర్‌నగర్ జ్యోతిరావుకాలనీలో నివసించే మల్లేష్, భార్య కవిత, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నారు. ఈ నెల 2న తల్లిదండ్రులు పనులకు వెళ్లగా వారి కుమారులు స్కూల్‌కు వెళ్లారు. ఇంట్లో గ్యాస్ లీకైన విషయం కుటుంబసభ్యులకు తెలియదు. పాఠశాల నుండి ఇంటికి వచ్చిన కుమారుల్లో చిన్న కుమారుడు బన్నీ (7) ఇంటి తలుపు తీసి లైట్ వేయగానే అప్పటికే గ్యాస్ లీకై ఉండటంతో ఒక్కసారిగా సిలిండర్ పేలి బన్నీకి మంటలు అంటుకున్నాయి. తీవ్ర గాయాలపాలైన బన్నీని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంను కలిసిన మేడ్చల్ నాయకులు



మేడ్చల్: ఇటీవల బీఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన మేడ్చల్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. రాఘవేందర్‌గౌడ్, మండల జెడ్పీటీసీ సభ్యురాలు శైలజ, శ్రీరంగవరం మాజీ సర్పంచ్ విజయానంద్‌రెడ్డిలు సీఎం ను కలిశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వజ్రేష్‌యాదవ్ నాయకులు పాల్గొన్నారు.

పంచాంగం ఆవిష్కరణ

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలకేంద్రంలోని శ్రీ మద్విరాజట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వద్ద విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పంచాంగం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విశ్వకర్మ ఐక్య సంఘం అధ్యక్షుడు ఎర్రోజి బిక్షపతిచారి, మూడుచింతలపల్లి డిప్యూటీ తహసీల్దార్ నాగజ్యోతి లు ముఖ్యఅతిధులుగా హాజరై 2024 సంవత్సర పంచాగాన్ని ఆవిష్కరించారు.విశ్వకర్మ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌చారి, మండల అధ్యక్షుడు బాలకృష్ణచారి, పలువురు విశ్వకర్మసంఘం సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



నాగారం, దమ్మాయిగూడ టీచర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరం

కీసర: నాగారం, దమ్మాయిగూడ టీచర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ సౌజన్యంతో మెడివిజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. టీచర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఇలాంటి సేవాకార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. టీచర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు మర్రెడ్డి హనుమంత్‌రెడ్డి, శ్యాంసుందర్, సిద్దులు, రమేష్, సంఘసభ్యులు పాల్గొన్నారు.

కీసరలో: కీసరలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌ను కీసర మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ స్వప్నరెడ్డి ప్రారంభించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



సమస్యల పరిష్కారానికి కృషి

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్‌లోని యాప్రాల్, శాంతినగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పర్యటించి కాలనీ వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు దేవాలయం కోసం స్థలం కేటాయించాలని, త్రీఫేజ్ విద్యుత్ లైన్ ఏర్పాటుచేయాలని, డ్రైనేజీ సమస్యల పరిష్కరించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని, వైన్ షాప్, సెల్‌ఫోన్ టవర్ తొలగించాలని, తదితర సమ్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఉపేందర్ రెడ్డి, జీకే.హన్మంతరావు, అంజయ్య, మధుసూదన్‌రెడ్డి, శివకుమార్, రమేష్, వసంత్, శ్రీనివాస్, విక్రమ్, శోభా, ప్రమీల, కాలనీవాసులు వెంకట్, వీరేశం, వెంకటేశ్వర్లు, త్యాగరాజు, బిక్షపతి, శ్రీహరి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



పార్థీవరెడ్డికి కండువా కప్పుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఘట్‌కేసర్: చౌదరిగూడకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేహగౌడ్ సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం క్యాంపు కార్యలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చౌదరిగూడ మాజీ సర్పంచులు రాములుగౌడ్, రమాదేవి, చౌదరిగూడ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మహిళ శాఖ మండల అధ్యక్షురాలు మంగ, బీఆర్‌ఎస్ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు పార్థీవరెడ్డి, నాగేశ్, శ్రీరాములుకు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

మహిళా సంక్షేమానికి బీజేపీ పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల జమున

మేడ్చల్ రూరల్: దేశంలోని మహిళల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ మహిళా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె వచ్చే ఎన్నికల్లో ప్రదాని మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. జిల్లా పార్టీ అధ్యక్షులు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, సెన్సార్ బోర్డు సభ్యురాలు, కౌన్సిలర్ అమరం సరస్వతి పాల్గొన్నారు.

విద్యార్థి జీవితం ఎంతో విలువైనది



చిన్నారుల సంస్కృతిక కార్యక్రమం

మేడ్చల్ రూరల్: పాఠశాల దశ నుండే చిన్నారులు లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాని సాకారం కోసం కృషి చేయాలని మేడ్చల్ సీఐ సత్యనారాయణ అన్నారు. మునీరాబాద్ గ్రామంలోని ఎస్‌కేఎం పాఠశాల 2వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి జీవితం ఎంతో విలువైందని వివరించారు. చిన్ననాటి నుండే లక్ష్యం ఎంచుకుని సాకారం చేసుకోవాలని, సమాజంలో మంచి గుర్తింపు సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ లవకుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా సీఎంఆర్‌టీసీ వార్షికోత్సవం



మేడ్చల్ రూరల్: విద్యార్థుల చదువులు, ప్రతిభ సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ కళాశాలలో శనివారం రాత్రి ఎప్లొరెన్స్ 2 కె 24 పేరిట కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థులు కొత్త టెక్నాలజీని ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. తమ చదువులు కుటుంబంతో పాటు సమాజ శ్రేయస్సుకై ఉండాలన్నారు. కళాశాల సెక్రటరీ వసంతలత, సీఈఓ అభినవ్‌రెడ్డి పాల్గొన్నారు.

పీర్జాదిగూడలో బీఆర్‌ఎస్ పార్టీకి షాక్

కాంగ్రెస్‌లో చేరిన డిప్యూటీ మేయర్, ప్రజాపతినిధులు



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న డిప్యూటీ మేయర్

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో బీఆర్‌ఎస్ పార్టీకి పెద్దషాక్ తగిలింది. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలంతా కాంగ్రెస్ పార్టీలో చేరారు. మేడ్చల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అధ్యక్షతన పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, పార్టీ అధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సముక్షం లో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి గట్టి దెబ్బ

పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో బీఆర్‌ఎస్ పార్టీ బలంగా ఉంది. పాలకవర్గంలో మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా అందరూ బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నారు. కొంత కాలంగా పీర్జాదిగూడలో రెండు గ్రూప్‌లుగా విడిపోయారు. ప్రస్తుత మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై తిరుగుబాటు ఎగురవేశారు. ఈక్రమంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

డిప్యూటీ మేయర్... కార్పొరేటర్లు చేరిక

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సముక్షంలో పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్గ దయాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి, మాడుగుల చంద్రకళ, అల్వాల సరిత, తూంకుంట్ల ప్రసన్న లక్ష్మి, బైటింటి శారద, యాసారం మహేశ్వరి, బొడిగె స్వాతిగౌడ్, బచ్చా రాజు, సుమలత, నవీన్‌రెడ్డి, అమర్‌సింగ్, కో ఆప్షన్ సభ్యులు బొడిగె రాందాస్‌గౌడ్, చిలుముల జగదీశ్వర్ రెడ్డి, ఇర్ఫాన్ చేరారు.

అవిశ్వాసం దిశగా అడుగులు...

కాంగ్రెస్‌పార్టీలో చేరిన డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు ప్రస్తుత మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఆదివారం 12 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. మరికొంత మందిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుని అవిశ్వాసం పెట్టేందుకు పూర్తి స్థాయి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం.